ప్రజలకు చేరువలో రెవెన్యూ సేవలు


రాపూరు: మాజీ రెవెన్యూ ఉద్యోగిని సత్కరిస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం


నాయుడుపేట: మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

దక్కిలి: ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూశాఖ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1786 జూన్ 20వ తేదీన బ్రిటీష్ పాలకులు రెవెన్యూ డేను ప్రారంభించారని తెలిపారు. ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తూ రెవెన్యూ శాఖ కీలకంగా ఉందన్నారు. క్యాలెండర్‌లో ప్రతి నెలలో ప్రత్యేక దినోత్సవాలు ఉన్నాయని, రెవెన్యూ శాఖకు కూడా ఒక రోజు ఉండాలని అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని కోరగా జూన్ 20వ తేదీన రెవెన్యూ దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ను మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, సర్వేయర్ సుబ్రమణ్యం, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు.


దక్కిలి: తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు


పెళ్లకూరు: విశ్రాంత వీఆర్వో రాజగోపాల్‌ను సన్మానిస్తున్న అధికారులు

రాపూరులో రెవెన్యూ డే

రాపూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత వీఆర్వో వెంకటరామిరెడ్డిని తహసీల్దార్ వెంకటరత్నం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 20వ తేదీని రెవెన్యూ డే గా నిర్ణయించిందని, ఇందులో భాగంగా మాజీ రెవెన్యూ ఉద్యోగులను సత్కరించాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, డీటీలు సురేఖ, సునీల్, ఆర్‌ఐ సతీష్, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు

పెళ్లకూరు: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సత్వరం సేవలు అందిస్తున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌రావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు రాజగోపాల్, హరినాథ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ఆర్‌ఐ సంతోషినిబాయి, నాయకులు ప్రసాద్‌నాయుడు, రమేష్‌నాయుడు, సత్యంరాజు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర రెవెన్యూ సేవలు

నాయుడుపేట టౌన్: ప్రజల రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని తెలిపారు. సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయుడుపేట రెవెన్యూ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల హయాం నుంచే జమీందారి వ్యవస్థతో రెవెన్యూ విభాగం ప్రారంభమైందన్నారు. కీలకంగా ఉండే రెవెన్యూ సమస్యలపై అధికారులు సానుకూలంగా వ్యవహరించి పరిష్కారానికి చర్యలు తీసుకుని మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. తహసీల్దార్ కల్యాణి, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర, విశ్రాంత ఆర్‌ఐ బి.సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం


తడ: విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది, నాయకులు


దొరవారిసత్రం: మర్రెయ్యను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

తడ: రెవెన్యూ డేని పురస్కరించుకుని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు సీనియర్ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ప్రతి ఏటా జూన్ 20వ తేదీన రెవెన్యూ డే నిర్వహిస్తారు. ఇందులో భాగంగా చేనిగుంటకు చెందిన విశ్రాంత తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, తడ కండ్రిగకు చెందిన విశ్రాంత ఆర్‌ఐ ఏడుమలైరెడ్డిని ఘనంగా సత్కరించారు. డీటీ శరత్, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంపీపీ కొళవి రఘురెడ్డి, స్థానిక నాయకులు ఆర్‌కే సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగి ఎం.మర్రెయ్యను సన్మానించారు. తహసీల్దార్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

కండలేరులో 6.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు కోలితోట చెంచమ్మ తిరుణాళ్ల


విశేషాలంకరణలో చెంచమ్మ

దక్కిలి: మండలంలోని అముదూరు సమీపంలో వెలుగొండల కింద వెలసిన చెంచులక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం చెంచమ్మ తిరుణాళ్లను ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవో అరవభూమి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అభిషేకం, 8 గంటలకు శ్రీవారికి విశేష అలంకరణ చేపడతామన్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. 9 గంటలకు చెంచులక్ష్మీ, నరసింహస్వామి కల్యాణం, 12.30 గటలకు మహా నైవేద్యం, అన్నదానం, సాయంత్రం 5 గంటలకు వసంతోత్సవం, పల్లకీ సేవ, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ చేస్తామని తెలిపారు. రాత్రి 8 గంటలకు అన్నదానం చేస్తామని వెల్లడించారు. రాత్రి 9 గంటలకు చెంచులక్ష్మీ వైభవం నాటకం, 10 గంటలకు పొందు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పూరిల్లు దగ్ధం

కోట: మండలంలోని వంజివాకలో పెద్ద క్రిష్ణయ్యకు చెందిన పూరిల్లు గురువారం కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ


విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

వాకాడు: మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యాకానుక కిట్లు సర్పంచి దువ్వూరు భాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. అలాగే భాస్కర్‌రెడ్డి దాతృత్వంతో నోట్ బుక్స్, పలకలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిప్రసూన, ఉపాధ్యాయురాలు లక్ష్మీ, సౌజన్య, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూళ్లకు యూనిఫాం సరఫరా


రాపూరులోని పాఠశాలలకు యూనిఫాం తరలిస్తున్న ఎంఈవో జిలానీబాషా

రాపూరు: మండలంలోని పాఠశాలలకు యూనిఫాం అందజేసినట్టు ఎంఈవో జిలానీబాషా తెలిపారు. ఆయన గురువారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 9 ఉన్నత, 69 ప్రాథమిక పాఠశాలల్లో 4,252 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారికి ఒక్కొక్కరికి మూడు జతల యూనిఫాంను ప్రభుత్వం మంజూరుచేసిందని తెలిపారు. గురువారం ఉన్నత పాఠశాలలకు అందజేశామని, శుక్రవారం ప్రాథమిక పాఠశాలలకు అందజేస్తామని వివరించారు.

గోనుపల్లిలో నేను బడికి పోతా


పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్న నాగేంద్రకుమార్

రాపూరు: మండలంలోని గోనుపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు గురువారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మండలంలోని తెగచర్ల గ్రామంలో 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గోనుపల్లిలోని ఉన్నత పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. వారిని ఒప్పించి నలుగురిని 9వ తరగతిలో చేర్పించారు. అలాగే వివిధ గ్రామాలను సందర్శించి విద్యార్థులు చదువు మానేయకుండా పాఠశాలల్లో చేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరంధామయ్య, వెంకటేశ్వర్లు, విజయమ్మ, మోహన్‌రావు, ప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం



చింతవరంలో మద్యం దుకాణం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

చిల్లకూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించడం నేరమని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు మద్యం దుకాణాల వద్దే మద్యం సేవించి ఎక్కడ పడితే అక్కడ పడేసిన ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో ప్రతి మద్యం దుకాణం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే చెత్తను తొలగిస్తున్నట్టు వెల్లడించారు.

సీజ్ చేసిన ఇసుకపై నాయకుల కన్ను


మావిళ్లపాడు గ్రామ సమీపంలో డంపింగ్ యార్డులో సీజ్ చేసిన ఇసుక

దొరవారిసత్రం: మండలంలోని మావిళ్లపాడు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇసుక డంపింగ్ యార్డులో 27 వేల టన్నుల ఇసుక ను మైనింగ్ అధికారులు పదిరోజుల క్రితం సీజ్ చేశారు. దీనిపై కన్నేసిన కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులను మభ్యపెట్టి రాత్రికి రాత్రే తరలిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన ఇసుక వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కాపలా ఉన్నారు. బుధవారం రాత్రి అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు యంత్రాలు, టిప్పర్ లారీలను తీసుకువచ్చి అనుమతులు ఉన్నాయంటూ ఇసుకను లోడ్ చేసేందుకు ప్రయత్నించినట్టు సమాచారం. సిబ్బంది అధికారులకు సమాచారం అందించడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. వారు అనుమతులపై ఆరా తీయడంతో నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీనిపై తహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా ఇసుక డంపింగ్ యార్డు వద్దకు ఎవరు వచ్చారనే విషయం తమకు తెలియదని చెప్పారు. ఇసుకపై మైనింగ్ అధికారులు తమకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదన్నారు.

విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు

చిల్లకూరు: పాఠశాలలు ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేపట్టిందని, ఇందులో భాగంగానే మండలంలో తొలి విడతగా గురువారం అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను అందజేసినట్టు ఎంఈవో -2 ఎండీ రవూఫ్ తెలిపారు. ఆయన గురువారం చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు షూస్, స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంను అందజేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమణయ్య, ఏడుకొండలు, భాస్కర్, వాసు, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూళ్లూరుపేటలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేటలోని షార్ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న నంద మినీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ నాయుడుపేట ఈఈ ప్రసన్నకుమార్ తెలిపారు. నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి విద్యుత్ సబ్ డివిజన్‌లోని వినియోగదారులు, వ్యవసాయ విద్యుత్ సమస్యలపై రైతులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, విశ్రాంత జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ, నాయుడుపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు పాల్గొంటారని పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


కూలిన గోడ(సర్కిల్‌లో)

గూడూరు రూరల్: గూడూరు ఏరియా ఆస్పత్రిలో గురువారం సన్‌సైడ్ గోడ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమా దం తప్పింది. ఆస్పత్రిలోని భవన నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తోంది. అక్కడక్కడా పగుళ్లు ఏర్పడుతున్నాయి. వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో కూలిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

గూడూరు రూరల్: గూడూరు డివిజన్‌లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం గూడూరులోని డివిజన్ విద్యాశాఖ కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతోనే కార్పొరేట్ విద్యా సంస్థలు తమ వద్ద లేని కోర్సులను కూడా బోధిస్తున్నట్లు చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంను తమ వద్దే కొనుగోలు చేయాలని పట్టుబడుతున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రతి పాఠశాలను విద్యాశాఖాధికారులు కూడా తనిఖీలు చేసి తల్లిదండ్రులకు కష్టం లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, బీజేవైఎం గూడూరు, చిల్లకూరు నగర అధ్యక్షులు శివశంకర్, కమల ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం


చిల్లకూరులో పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న అధికారులు

చిల్లకూరు: పంట సాగు చేపట్టే ముందు పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేస్తే భూమి సారవంతమవుతుందని, తద్వారా పంట దిగుబడి ఎక్కువగా ఉంటుందని ఏడీఏ గోపీనాయక్ తెలిపారు. చిల్లకూరులోని సచివాలయంలో గురువారం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 155 క్వింటాళ్ల జీలుగలు, ఒక టన్ను పిల్లి పెసర, 7 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం రాయితీ ఇస్తున్నందున రైతులు పిల్లి పెసరకు రూ.67లు, జీలుగ, జనుములు రూ.44లు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి గూడూరు భవాని, పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, నాయకులు పట్టాభిరామిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


పోలీస్ స్టేషనల్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

దొరవారిసత్రం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వసతులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు పురోగతిని ఆరా తీశారు. ఆయన వెంట డీఎస్పీలు వెంకటాద్రి, శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ తిరుమలరావు ఉన్నారు.

తల్లీ చల్లగా దీవించమ్మా

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిలుపు
- అంగరంగ వైభవంగా పోలేరమ్మ జాతర
- అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోలాహలం


ప్రత్యేక పూల వాహనంపై చాకలివీధి నుంచి సన్నిదానానికి వస్తున్న పోలేరమ్మ


ఆలయంలో కొలువుదీరిన పోలేరమ్మ

వెంకటగిరి రూరల్/వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలోని బంగారుపేటలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం రాత్రి రజక నివాసం నుంచి పోలేరమ్మను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ఆలయానికి తీసుకువచ్చారు. చాకలి వీధి నుంచి బంగారుపేట మెయిన్ రోడ్డు మీదుగా అమ్మవారిని అశేష భక్త జన సందోహం మధ్య బుధవారం తెల్లవారుజామున ఆలయానికి తీసుకువచ్చి కొలువుదీర్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత చిందులేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతోపాటు పలువురు రాజకీయ నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా సీఐ సంగమేశ్వరరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారి గ్రామోత్సవం



వేయికళ్ల దుత్తలతో అమ్మవారి గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, ఆలయం ముందు పోటెత్తిన భక్తజనం (ఇన్‌సెట్) యువత కేరింతలు

నెలబల్లిలో ఘనంగా గంధోత్సవం


ప్రత్యేక అలంకరణలో హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామంలోని హుస్సేనమ్మ దర్గాలో గురువారం రాత్రి 54వ గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దర్గా వద్దకు మేళతాళాల వాయిద్యాల నడుమ గంధాన్ని భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అందజేశారు. ప్రత్యేకించి భక్తుల కోసం దర్గా వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ తిరుమలరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుస్థితిలో తహసీల్దార్ కార్యాలయ భవనం


రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గదిలో నిలిచిన వర్షపు నీరు


సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప కమ్మీలు కనిపిస్తున్న పైకప్పు

సైదాపురం: ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే మండల రెవెన్యూ కార్యాలయ భవనం దుస్థితికి చేరింది. తలుపులు దెబ్బతిన్నాయి. రికార్డుల గది శిథిలావస్థకు చేరింది. వర్షం కురిస్తే కార్యాలయం ఉరిసి జలమయమవుతోంది. సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాన్ని బాగు చేయాలని అధికారులను కోరుతున్నారు. మండల కేంద్రమైన సైదాపురం గ్రామ సమీపంలో తహసీల్దార్ కార్యాలయం ఉంది. దీన్ని సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. తర్వాత మరమ్మతులు చేయలేదు. దీంతో భవనం దుస్థితికి చేరింది. పైకప్పు సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గది చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. రికార్డుల గది మరీ అధ్వానంగా తయారైంది. కార్యాలయంలో ఉన్న విద్యుత్ వైర్లు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన గది నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిబ్బంది పనిచేస్తున్నారు.